# రామమాఢ

-పి.వి.ప్రభాకరమూర్తి

పైడితల్లి సగం జీవితం చింతచెట్టుమీదే గడిచిపోయింది. సాయంత్రం వరకూ చింతచిగురు పోగు చెయ్యడం, ఉదయాన్నే ఇల్లిల్లూ తిరిగి అమ్మగా వచ్చిన నాలుగు డబ్బులతో జీవితం గడుపుతోంది. చిగురించిన చింతచెట్టును చూడగానే పైడితల్లి మొఖం వేయి కాంతులతో నిండిపోతుంది. నిమిషాలమీద చెట్టు ఎక్కి చింతచిగురు కోయందే ఉండలేదు. ఎనిమిదేళ్ల వయసునుంచే పైడితల్లికి చింతచెట్లతో సహవాసం కుదిరింది. ఐదుపదుల వయసులో కూడా ఎంత పెద్ద చింతచెట్టయినా ఎక్కేస్తుంది. ఆమెతో పోటీపడి చింతచిగురు వ్యాపారం మొదలుపెట్టిన ఆడుంగులందరూ కిందపడి గాయాలపాలయ్యారు.

ఆ చుట్టుపక్కల పది గ్రామాలవరకూ పైడితల్లికి తిరుగులేదు. ఏ గ్రామంలో సంత జరిగినా పైడితల్లి చింత చిగురు బుట్టతో హాజరవుతుంది. 'ఈ చింత చిగురు పప్పులో వేసుకుంటే స్వర్గం కనిపిస్తుంది బాబూ' అంటూ చింత చిగురును వంటలో ఎలా ఉపయోగించుకోవాలో తెలియని వాళ్లకు చెబుతుంది.

చింత చిగురు పచ్చడి చేసుకుంటే రోజూ అదే కావాలంటారు అంటూ ఎదుటివారి నోటిలో నీళ్ళూరేలా వర్ణిస్తుంది. ఇలాంటి కబుర్లతో, తెచ్చిన చింత చిగురంతా అమ్ముకుని సాయంత్రానికి ఇల్లు చేరుకుంటుంది పైడితల్లి.

వెనకముందు ఎవరూలేని పైడితల్లి నూటికో కోటికో ఎవరికో మాత్రమే ఉండే అలవాటు చేసుకుంది. పగటిపూట ఎవరో ఒకరికి అన్నం పెట్టందే తను పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టదు.

చింతచిగురు అమ్ముకుని వచ్చి వంట చేసి పాకముందు నులకమంచం మీద కూర్చుని రామజపం చేస్తూ భోజనానికి ఎవరయినా వస్తారేమోనని ఎదురుచూస్తూ వుంటుంది. ఎవరయినా వస్తే వాళ్లకి పరమానందంతో భోజనం వడ్డించి, తర్వాత తను తిని నులకమంచంమీద నడుం వాలుస్తుంది.

రామ జపం చేస్తూ చూడడానికి శబరిని పోలివుండే పైడితల్లిని చూసి 'పూర్వం శబరి రాముడికి రేగిపండు ఇచ్చింది, ఇప్పుడు రాముడు కానీ వస్తే ఈ పైడితల్లి చింత చిగురు ఇస్తుందేమో!' అని నవ్వేవారు జనం.

ఆ మాటలు విన్న పైడితల్లి 'ఏమో అదే నిజమవుతుందేమో' చిరునవ్వు నవ్వుకునేది.

ఆ ఊరి కరణంగారు ఉదయాన్నే వేపపుల్ల నోట్లో పెట్టుకుని వీధి వసారాలో తిరుగుతున్నారు. చింత చిగురుబుట్టతో పైడితల్లి కనిపించేసరికి ఆయనకు ఒక ఆలోచన వచ్చింది.

వచ్చిందే తడవుగా ఊర్లో పెద్దలను కలిసి "మనందరం కలిసి, పైడితల్లికి సన్మానం చెయ్యాలి" అన్నారు కరణంగారు.

"పైడితల్లికే ఎందుకు చేయాలి, నాకెందుకు చేయకూడదు" వెకిలిగా అన్నాడు భాస్కరమూర్తి చుట్టని నోట్లో తిప్పుతూ.

"ఎందుకంటే నువ్వు పైడితల్లి ఎక్కినట్లు చింతచెట్లు ఎక్కలేవు కాబట్టి" అన్నారు కరణం గారు చిరాగ్గా.

"పైడితల్లి సంగతి మనకేకాక చుట్టుపక్కల ఊళ్లవాళ్ళందరికీ తెలుసు. అది మన చిన్నతనం నుండీ చింతచిగురు అమ్ముతోంది. పైగా అది ఎక్కినంత చాకచక్యంగా చింతచెట్టు ఈ చుట్టుపక్కల ఆడంగులు ఎవరూ ఎక్కలేరు. దానికి భక్తి కూడా ఎక్కువే" అని చెప్పటం ఆపారు కరణం గారు.

"రామభక్తికి గుహుడూ, శబరీ తర్వాత స్థానం మన పైడితల్లిదే" యజ్ఞోపవీతంతో వీపు గోక్కుంటూ అన్నారు అప్పలాచారిగారు.

ఊరంతా పైడితల్లికి సన్మానం చేయడానికి అంగీకరించారు. పంతులుగారు మంచిరోజు నిర్ణయించారు.


పైడితల్లికి ఫలానా రోజున సన్మానమని చుట్టుపక్కల ఊళ్లలో టముకు వేయించారు. ఉదయం అన్నదానం, సాయంత్రం సన్మానం చేయడానికి నిర్ణయించారు. సన్మానం మాత్రం పైడితల్లి పాకకు దగ్గరలోవున్న చింతచెట్టుకిందే చేయాలన్నారు. చింతచెట్టుకింద సన్మానం చేయడమే ఉచితంగా ఉంటుందని ఊరి పెద్దలు అన్నారు.

***

సన్మానం చేసే రోజుకోసం అందరూ ఎదురు చూసారు. అందరూ ఎదురుచూసినట్లుగానే ఆరోజు రానే వచ్చింది. చుట్టుపక్కల ఊళ్ళ వారందరూ సొంతింట్లో కార్యక్రమంలాగనే అన్ని పనుల్లో సహాయపడుతున్నారు. భోజనంలో స్పెషల్ ఐటమ్‌గా 'చింత చిగురు పప్పు'ను నిర్ణయించారు. అదీ స్వయంగా పైడితల్లి కోసి తెచ్చిన చింత చిగురుతోనే. మధ్యాహ్నాం రెండు గంటలకల్లా అందరూ భోజనాలు ముగించి బ్రేవుమని తేన్చారు. కొందరు చెట్ల క్రింద నడుం వాల్చారు.

పైడితల్లి రామనామం జపిస్తూ పాకముందు నులకంమంచం మీద నడుం వాల్చింది. దూరంగా ఎవరో వస్తున్న శబ్దం వినిపించి అటు వైపు చూసింది.

ఎవరో నలుగురు వ్యక్తులు పైడితల్లి పాకవైపే వచ్చి ఎదురుగా నిలబడ్డారు. ముగ్గురు మగ వాళ్ళు ఒక ఆడ మనిషి.



అందులో ఒక వ్యక్తి ముందుకు వచ్చి "కొద్దిగా మంచినీళ్ళు ఇవ్వు తల్లీ" అన్నాడు.

పైడితల్లి పాకలోకి వెళ్ళి కుండలో నీళ్ళు పట్టుకొచ్చి అందరికీ ఇచ్చింది. వాళ్ళని చూడ గానే ఎంతోదూరం నుంచి వస్తున్నవాళ్ళలా ఉన్నారు.

వారిలో జాంపండులా ఉన్న ఎర్రబ్బాయి మాత్రం చాలా చలాకీగా ఉన్నాడు. మిగిలిన ముగ్గురూ ఏ పనిచెప్పినా చిత్తం చిత్తం అంటూ చేసేస్తున్నాడు.

క్షణాల్లో చింతచెట్టు ఎక్కి అక్కడనుండి పైడితల్లివైపు చూసి చేయి వూపుతున్నాడు 'చూసావా నీకన్నా వేగంగా చింతచెట్టు ఎక్కాను' అన్నట్టుగా.

ఇంతలో వారిలో పెద్దాయన "బాగా ఆకలిగా ఉంది. తినడానికి ఏమైనా పెట్టు తల్లీ' అన్నాడు పైడితల్లివైపు చూస్తూ.

పైడితల్లి నిర్ఘాంతపోయింది.

భోజనాలు అందరితో కలిసి తినడం మూలంగా ఇంట్లో అన్నీ ఖాళీ గిన్నెలు ఉన్నాయి.

ఏమి చేయాలో తోచలేదు. అటూ ఇటూ చూసింది. ఉన్నట్లుండి బుర్రలో ఓ మెరుపు మెరిసింది. తాటాకు బుట్ట నడుంకు కట్టుకుని, గబగబా చింతచెట్టు ఎక్కి చింత చిగురు కోసి, మెరుపువేగంతో దిగిపోయింది. అరిటాకు కోసుకొచ్చి అందులో చింత చిగురు ఉంచి వాళ్ళ చేతుల్లో పెట్టింది. వాళ్ళు తినడానికి సంశయిస్తుంటే అందరికి కొద్దికొద్దిగా చింత చిగురు పెట్టింది. అందరికన్నా పెద్దాయన ఆప్యాయంగా చింత చిగురు రుచిని ఆస్వాదించాడు. ఆవిడ మాత్రం పులుపు పెద్దగా నోటికి పట్టనట్లు మొహం పెట్టింది. మూడో వ్యక్తి అందరివైపుచూస్తూ చింతచిగురు తింటున్నాడు. ఎర్రబ్బాయి మాత్రం నాకు చింతచిగురు తినడం అలవాటే అన్నట్లుగా అరిటాకులో వున్న చింతచిగురంతా ఖాళీ చేసాడు.

"నీ ఆతిథ్యానికి చాలా సంతోషం" అంటూ పెద్దాయన పైడితల్లికి నమస్కరించాడు.


పైడితల్లి సంతోషంగా వారిని సాగనంపింది. నలుగురూ నవ్వుతూ వెళ్ళిపోయారు. ఎందుకో తెలియదుగానీ పైడితల్లికి మనసంతా చెప్పలేనంత సంతోషంగా ఉంది. వాళ్ళు అక్కడ ఉన్నంతసేపూ గంధం వాసన అక్కడంతా వ్యాపించింది. సంపెంగపూల గుత్తులు సువాసనతో విజృంభించాయి. పైడితల్లి చాలాసేపు ఆనందంగా వాళ్ళు వెళ్లినవైపే చూస్తుండిపోయింది.

పైడితల్లికి సన్మానం జరిగింది. ఘనంగా జరిగింది. నభూతో నభవిష్యతి అన్నట్లుగా జరిగింది.

ఊళ్ళోవాళ్ళందరూ కలిసి వెండితో చేసిన బుట్టని సన్మాన కార్యక్రమంలో పైడితల్లికి చదివించారు. జనం ఎవరికి తోచినది వాళ్ళు చదివస్తున్నారు.

## చీర గొప్పతనం

ఇటీవల వచ్చిన 'మల్లన్న'లో హాట్ హాట్ గెటప్పుల్లో దర్శనమిచ్చిన



శ్రియ ఆమధ్య 'శివాజీ' ఫంక్షన్‌కి కూడా కురచ దుస్తుల్లో వచ్చి సంచలనం సృష్టించింది. అలాంటి శ్రియ టొరంటోలో జరిగే ఫిల్మోత్సవ్‌కి చీరలోనే వెళ్లాలని ఆ ఉత్సవాల అన్ని రోజులూ చీరలోనే కనిపిస్తానని చెబుతోంది. చీరలో తన అందాన్ని ద్విగుణీకృతం చేసుకుని చీర గొప్పదనాన్ని చాటడమే తన లక్ష్యమని కూడా అంటోందిట. మరి అంత ర్జాతీయ స్థాయిలో జరిగే అలాంటి ఫంక్షన్‌లో శ్రియ ఇలా చీరనే ధరించి కనిపిస్తానని చెప్పడం గొప్ప విషయమే కదా!




చాలామంది డబ్బులు చదివించారు. మధ్యాహ్నం పైడితల్లి ఇంటికివచ్చిన నలుగురిలోని ఎర్రబ్బాయి అందరిమధ్యలోంచి వచ్చి పైడితల్లి చేతిలో ఓ పొట్లం ఉంచి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత అతను ఎవరికి కనిపించలేదు. పైడితల్లి ఆ పొట్లాన్ని జాగ్రత్తగా కొంగుచివర ముడివేసుకుంది.

జనంలో ఎవ్వరు కూడా పైడితల్లికి సన్మానం చేయడం ఏమిటి? అదేమన్నా మినిష్టారా? మన ఊరికేమన్నా ఊడబొడిచిందా? అని ఏ ఒక్కరూ అనుకోలేదు.

అందరూ కలిసి ఇంట్లో వ్యక్తికి సన్మానం చేసినట్టుగా ఆనందపడ్డారు. పైడితల్లి భక్తికి అందరూ సన్మానం చేసారు. ఆమెలో ఉన్న రాముడికి సన్మానం చేశారు.

ఆమె నాలుకమీద నాట్యం చేస్తున్న రామనామానికి సన్మానం చేశారు. పైడితల్లిని పాక దగ్గర వదిలి పిల్లాపెద్దలందరూ హాయిగా, ఆహ్లాదంగా ఇంటిదారి పట్టారు.

★★★

పైడితల్లి నులకమంచంమీద పడుకుని ఆకాశంకేసి చూస్తోంది. అమావాస్య వస్తోంది కాబోలు చంద్రుడు బక్కచిక్కి పోయాడు. చంద్రుడి గురించి ఆలోచిస్తున్న పైడితల్లికి శ్రీరామచంద్రుడు గుర్తొచ్చాడు. ఎప్పుడూ చింతచెట్టుమీద చింత తప్పించి భద్రాచలం వెళ్ళి కన్నులారా ఆ రాముడ్ని చూద్దామనిలేదా? మనస్సు నిలదీసింది. వీలుచూసుకుని, వయస్సు సహకరిస్తే తప్పక ఆ రాముడ్ని చూస్తాను, మనస్సును సమాధానపరచుకుంది. తప్పక ఆ రాముడ్ని చూస్తాను, చూస్తాను అనుకుంటూ రామనామం జపిస్తోంది పైడితల్లి.

అర్ధరాత్రి వేళ పైడితల్లికి తన దగ్గరగా ఎవరో మాట్లాడుకుంటున్నట్లనిపించింది.

"హనుమా! మనల్ని పైడితల్లి గుర్తుపట్టలేదంటావా?" అని ఓ పురుష కంఠం వినిపించింది.

"లేదు స్వామీ!" అని సమాధానం వచ్చింది అవతలివైపునుండి.

"గుర్తించకపోతే పోనీవయ్యా! నువ్వు సన్మానంలో మనం పైడితల్లికి ఇచ్చిన బహుమతయినా చూసిందా లేదా!" ఆతృతతో అడిగినట్లనిపించింది.

"కొంగు బంగారాన్ని పట్టించుకోకపోవడమేమిటయ్యా!" అవతలి వ్యక్తి మృదు మధురంగా అడిగాడు.

పైడితల్లి ఉలిక్కిపడి లేచింది.

శ్రీరామా..శ్రీరామా అంటూ చీకట్లో కలయతిరిగింది. ఒక్క ఉదటున కొంగున వున్న కాగితం పొట్లం విప్పింది.

అంతే...దోసిలిలో ఉన్న 'బంగారు రామమాడ'ను చూసి ఆమె రెండు కళ్ళూ చంద్రబింబాల్లా మెరిసిపోయాయి.

చంద్రుడు అద్భుతం చూసిన ఆనందంతో మేఘాలచాటుకు వెళ్ళిపోయాడు.

గుహుడికి రామభద్రుడిని చూసినప్పుడు కలిగిన అనుభూతే, శబరికి రామచంద్రుడిని చూసినప్పటి అనుభూతే పైడితల్లికి కలిగింది. రాముడిని గుండెలకు హత్తుకున్నంత తన్మయత్వంతో 'రామమాడ'ను హృదయానికి హత్తుకుంది.

పరవశించి పోయింది. ప్రకృతిలో కలిసి పోయింది.

★